నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

పదవ తరగతి విద్యార్థుల కోసం ఇండ్లకు టీచర్లు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో గైర్హాజరైన పదవతరగతి విద్యార్థుల కోసం టీచర్లు మంగళవారం వారి ఇండ్లలోకి వెళ్లి పాఠశాలకు తీసుకొచ్చారు. ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు, తొంటి శంకర్, జాడి శ్రీనివాస్, కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్ పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి తీసుకొచ్చారు. సాంఘిక అభ్యాస పరీక్షకు హాజరు కాని అజయ్, అరవింద్, సిద్ధు, రాంచరణ్, జుబిన్ ఇంటికెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షల సమయంలో అనారోగ్యం, శుభకార్యాల సాకుతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని వారికి అవగాహన కల్పించారు. దీంతో ఆరుగురు విద్యార్థులు పాఠశాలకు వచ్చి పరీక్ష రాశారు.



టోల్ ప్లాజా సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

నవతెలంగాణ - వాంకిడి

మండలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనుగొన్నామని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని టోల్ ప్లాజా ఖమానా ఎక్స్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారి పక్కన మృతదేహం ఉన్నట్టు సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. లైట్ గ్రీన్ షర్టు, వైట్ కలర్ దోతీ, గ్రీన్ కలర్ టవల్ ధరించి ఉన్నాడు. నడుముకు మొలదారం లేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670531 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి

- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి
- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ పార్టీ అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో తేడా చూశారని తెలిపారు. అవి హామీలు ఇచ్చే ప్రభుత్వాలైతే కాంగ్రెస్ ప్రభుత్వం చేతల్లో చేసి చూపించిందన్నారు. పట్టభద్రులకు 54వేల ఉద్యోగాలిచ్చిన చరిత్ర కాంగ్రెస్ దన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 11వేల టీచర్ పోస్టులివ్వడమే కాకుండా బదిలీలు నిర్వహించి టీచర్ల సమస్యలకు పరిష్కారం చూపిందన్నారు. ఇంకా పలు కొత్త ఉద్యోగాలు రానున్నాయన్నారు. కోడ్ వల్ల ప్రకటన రాలేదని, ఎన్నికల ఫలితాల అనంతరం సీతక్క ద్వారా శుభవార్త వింటారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా లక్షల సంఖ్యలో ప్రైవేట్ ఉద్యోగాల కల్పన కూడా జరిగిందన్నారు. పట్టభద్రులందరూ వారి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, కౌన్సిలర్లు యెల్మెల్వార్ రామ్‌కుమార్, షేక్ ఇమ్రాన్, కొండ గంగాధర్, నాయకులు ఎంఏ.షకీల్, కొండూరి రవి, మానే శంకర్, మునిగెల విఠల్, భరత్, శ్రవణ్ నాయక్, మంచాల మల్లయ్య, నిమ్మల ప్రభాకర్, సోమ ప్రశాంత్, మొహమ్మద్ సిరాజ్, సాయికృష్ణ, షేక్ మహమూద్, షేక్ ఖలీల్, షేక్ మోహిన్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు చించోలి, ఆలూరు, గోపాల్‌పేట్, తాండ్ర, ప్యారమూర్, వైకుంఠపూర్, వంకర్ గ్రామల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. పేదల పెన్నిధి విద్యా వ్యవస్థ పట్ల పట్టు కలిగిన విద్యావేత్త అయిన వూట్కూరు నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అంచలంచెలుగా నెరవేరుస్తూ ప్రజల మన్నలను పొందుతోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌రెడ్డి, లక్ష్మణ్, మారుతి, ముత్యంరెడ్డి, నారాయణరెడ్డి, సురేందర్, సూర్యం, సుభాష్‌రెడ్డి, సాయన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

కడెం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడారు. పట్టభద్రులకు న్యాయం జరగాలంటే నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కొండాపూర్ లక్ష్మణ్, ఎలగడప మాజీ సర్పంచ్ భూమేష్, పాకనాటి రాజేశ్వర్, జగన్‌రెడ్డి, లింబన్న, యాదగిరి, భూమేష్, సత్యం, కన్నె శ్రీనివాస్, రాజన్న, మహమ్మద్, షర్ఫుద్దీన్, వసీం, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాలచారి, కంది శ్రీనివాస్‌రెడ్డి

లక్షెట్టిపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మైనారిటీ మండల అధ్యక్షులు షాహిద్ ఆలీ అన్నారు. నరేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు వివేకంతో ఆలోచించి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు.

ఉట్నూర్ : మండలంలోని లక్కారం గ్రామంలో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, నాయకులు మార్సుకోల తిరుపతి, కొత్తపల్లి మహేందర్, తొడసం రాధాబాయి, సిడాం కౌసల్య, దేవానందం, దర్శన గంగరాజు, కోడి ప్రభాకర్ పాల్గొన్నారు.

పెంచికలపేట్ : ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎలుకపెల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చంద్రమౌళి, నాయకులు రాజన్న, కృష్ణ, సురేష్, గంగారాం, సదాశివ్ పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో..



లక్షెట్టిపేటలో..



ఉట్నూర్‌లో..

రహదారుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వినోద్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వినోద్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీలో జరిగిన కార్యకర్తల సమావేశంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మంచిర్యాల ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజల అవసరాలు తీర్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుకు అనుమతులు పొందేందుకు తీవ్రంగా కృషి చేసినట్లు తెలిపారు. రోడ్డు సౌకర్యంతో బుగ్గ ఆలయం పర్యాటక కేంద్రంగా విరజల్లుతుందన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని 3 మండలాల్లో జూనియర్ కళాశాలల నిర్మాణం కోసం స్థల సేకరణ జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అందుకుగాను ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, సీనియర్ నాయకులు కార్యారి రాంచందర్, నాతరి స్వామి, శంకర్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ఆర్.పల్లవి, కె.రోషిణి ఎం.దీపిక, ఎం.రోహన్, ఎస్.రోహిత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26, 27, 28 తేదీలలో హర్యానాలో జరిగే నెట్‌బాల్ జూనియర్ పోటీలలో పాల్గొంటారన్నారు. వీరితో పాటు అక్షరవనం కల్వకుర్తిలో చదువుతున్న విద్యార్థిని వినత్రయ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అలిబిన్ అహ్మద్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, రాకేష్, పిఈటి తిరుపతి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీగా గెలిపించండి

నవతెలంగాణ-ముధోల్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగుల పక్షాన పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు అన్నారు. ముధోల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పట్టభద్రులు తమ ఓటును ఆలోచించి వేయాలన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు, బలహీన వర్గాల కొరకు పని చేసే వ్యక్తిని చూసి ఓటేయ్యాలన్నారు. అలాగే భారత రాజ్యాంగాన్ని కాపాడే, పేదల పక్షాన పోరాటం చేసే, దళిత బహుజన ఉద్యమాల్లో పాల్గొంటున్న వ్యక్తిని చూసి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పలు పార్టీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆరోపించారు. వేటికి లొంగకుండా ప్రజలకు సేవ చేసిన వ్యక్తిగా, పేదలకు అండగా నిలిచిన వ్యక్తిగా, వైద్యునిగా సేవలందించిన వ్యక్తిగా తాను ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్నానని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు పరచకుండా కొంతమంది నాయకులు పక్కదారి పట్టిస్తూ బడుగు బలహీన వర్గాలను పైకి రాకుండా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నాలుగు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు వేసేటప్పుడు సీరియల్ నెంబర్ 35పై డాక్టర్ నిమ్మ తోట వెంకటేశ్వర్లు పక్కన ఓటు వేసి బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



నవతెలంగాణ-జైపూర్

యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని భీమారం మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ సూచించారు. మహిళ, శిశు వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బాలబాలికలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. ఎవరైన డ్రగ్స్ విక్రయించినా, తమ పరిసరాల్లో ఇతరులు మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు గుర్తిస్తే వెంటనే డ్రగ్స్ హెల్ప్‌లైన్ నెం. 14446 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రాయమల్లు, పోలీస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్, సత్తిరెడ్డి, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

నవతెలంగాణ-ఉట్నూర్



సబ్బండ వర్గాలకు సమన్యాయాన్ని చేకూర్చేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంతో కలిసి పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, లోక్ సాహిర్ అన్నాబావు సాఠె, మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని తీసుకున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 10ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేయలేని అభివృద్ధిని సంవత్సరంలోనే కాంగ్రెస్ చేసి చూపెట్టిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సీఎం రేవంత్‌రెడ్డిని బద్నామ్ చేస్తున్నాయన్నారు. కొందరు బీజేపీ కనుసన్నల్లో నడుచుకుంటూ ఆ పార్టీ వల్లే వర్గీకరణ సాధ్యమైందని చెప్పుకోవడం సరైంది కాదన్నారు. దేశంలో మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రశాంతంగా ఉన్న దేశాన్ని అగ్ని గుండంగా మార్చింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. దళితులు, ఆదివాసులపై దాడులు చేస్తున్న మతతత్వ బీజేపీకి వత్తాసు పలకడం దేనికి సంకేతమని, రాబోయే రోజుల్లో దేశం ప్రమాదాన్ని ఎదురుకోబోతోందని తెలిపారు. రాజ్యాంగమే మనకు రక్ష అని, ఆ రాజ్యాంగాన్ని రక్షించడానికి కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.12కోట్లు మంజూరు చేశామని తెలిపారు.

శాంతి గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే యోచన లేదు

- మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

నవతెలంగాణ-తాండూర్



శాంతిగనిని ఓపెన్ కాస్ట్‌గా మార్పు చేస్తారన్న వదంతుల్లో నిజం లేదని, బెల్లంపల్లి పరిధిలోని శాంతి గనిని భూగర్భ గనిగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లిలోని పాత జీఎం కార్యాలయంలోని ఏజెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిగని లాంగ్ వాల్ విస్తరణ కోసం మార్చి నెలలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ చేపట్టే ఉద్యోగ కల్పన, పర్యావరణ పరిరక్షణ, వసతి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. 2018 ఏప్రిల్ 6న కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ప్రకటించిన నూతన నియమావళి ప్రకారం పర్యావరణ అనుమతులు తీసుకునేందుకు ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ అనుమతులు పొందినట్లు తెలిపారు. భవిష్యత్తులో లాంగ్ వాల్ ప్రాజెక్టు కొనసాగాలంటే గని సామర్థ్యం 14.34 హెక్టార్లు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. దీని ద్వారా 9 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికి తీసే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం సమీప గ్రామాల్లో చెట్లు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నామని తెలిపారు. సమావేశంలో మందమర్రి ఏరియా ఎస్ఓటు జీఎం ఎం.విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, శాంతిఖని గని ఏజెంట్ ఖాదిర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ - వాంకిడి

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్ల సౌకర్యం కోసం పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, షామియానా, మూత్రశాలలు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీని ఆదేశించారు. దివ్యాంగ ఓటర్ల కొరకు వీల్ చైర్, ర్యాంప్ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల కొరకు పోలింగ్ కేంద్రంలో వేర్వేరుగా కంపార్ట్‌మెంట్లు ఉన్నందున ఆయా గదులలో వెలుతురు ఉండేలా చూడాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

లైంగికదాడి ఘటనపై సీతక్క స్పందించకపోవడం దారుణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాలికపై లైంగిక దాడి ఘటనపై ఇన్‌చార్జి, మహిళా మంత్రిగా ఉన్న సీతక్క స్పందించకపోవడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకులు సాజిదొద్దీన్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మైనారిటీ బాలికపై లైంగిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంత్రి సీతక్క ఇప్పటికీ స్పందించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సలీం పాషా, అత్తర్ ఉల్లా, అడపా తిరుపతి, సలీమ్, జాహుర్, ముఖిద్, పేరోజ్, అయూబ్, అలం, పర్వీన్ సుల్తానా, కరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వివిధ ఆశ్రమ పాఠశాలకు చెందిన 85 మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి చూపుతో బాధ పడుతున్న 85 విద్యార్థులకు త్వరలో కండ్లాద్దాలు పంపిణీ చేస్తామని డాక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. వైద్య శిబిరంలో ఆర్బీఎస్‌కే డాక్టర్ రాజమణి, నేత్ర వైద్య సహాయకులు విలాస్, విజయ్, హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది సునీత, ఈశ్వర్, జవహర్ ఉన్నారు.



డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి సన్మానం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్న కొండ గోవర్ధన్ ఇటీవల పీహెచ్‌డీలో పట్టా పొందారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో పొలిటికల్ పార్టిసిపెన్, పొలిటికల్ అవేర్నెస్ ఆఫ్ గ్రాస్ రూట్స్ లెవెల్ లీడర్ షిప్ ఇన్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందడం కళాశాలకు గొప్ప కీర్తి ప్రతిష్టలు తీసుకరవడం పట్ల అభినందించారు. ఇంకా ముందు ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, సోమన్న, రాజేశ్వర్, బాలాజీ, నాగభూషణ్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.



పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. మార్చి నెల 5 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 18,880 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్ఈకి సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలన్నారు. పోస్టల్ అధికారులు ప్రశ్నా పత్రాలను జాగ్రత్తగా తరలించాలని, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్‌లు అనుమతిలేదని స్పష్టం చేశారు. సెల్ ఫోన్‌లు, తదితర పరికరాలు పరీక్షా కేంద్రానికి అనుమతిలేదని ముందుగానే విద్యార్థులకు తెలుపాలన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పోలీస్ బందోబస్తు, తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఐఈఓ రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, పరీక్షల విభాగం గణేశ్, ధన్‌రాజ్, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి గ్రామపంచాయతీ పరిధిలోని సిరికొండ గ్రామంలో మంగళవారం కుమురంభీమ్ క్రికెట్ క్రీడా పోటీలను డీసీసీబీ డైరెక్టర మెస్రం పరమేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగు ఫౌండేషన్ ద్వారా రూ.20వేల బహుమతి మాజీ మంత్రి జోగు రామన్న ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ జగదీష్, అంకోలి మాజీ సర్పంచ్ భూమన్న, మాజీ ఎంపీటీసీ కనక రమణ, పీఏసీఎస్ డైరెక్టర్ చంటిబాపు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ గంగయ్య, గ్రామ పటేల్ చాకటి పురుషోత్తం, యువ నాయకులు ఎర్రం నర్సింగరావు, సిరికొండ పటేల్ మర్సకొల సొంజీ, భూమన్న, మోతీరామ్ వివిధ గ్రామాల క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాపట్ల లలిత



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాపట్ల లలిత ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాపట్ల లలితను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఐసీడీఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.1 లక్షలు ఇవ్వాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. అంగన్‌వాడీలో గత 30 ఏండ్లుగా పనులు చేస్తున్న ప్రభుత్వం మమ్మల్ని గుర్తించక పోవడం చాలా దారుణమని అన్నారు.

బాల్యవివాహం చేద్దామన్న ఆలోచన రావొద్దు

● జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ రాజేంద్రప్రసాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు కష్టపడి చదివి, చదువులో రాణించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్య వివాహం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు చేయడం నేరమని అన్నారు. తల్లితండ్రులు తక్కువ వయసు ఉన్నా పిల్లలకు పెండ్లి చేద్దామని ఆలోచనలు వస్తూ ఉంటాయని, అలాంటి ఆలోచన రావద్దంటే కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో రాణించాలన్నారు. ఎంత కష్టమొచ్చినా చదువును మధ్యలో ఆపివేయకుండా చదువుతు ముందుకు సాగాలని, విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకుంటే పెండ్లి చేయాలనే ఆలోచన తల్లిదండ్రులకు రాదన్నారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగిన, చేస్తున్న ఎవ్వరు కూడా భయపడకుండా 1098 నెంబర్ కు ధైర్యంగా ఫోన్ చేయాలని సూచించారు. సమాచారం చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అనంతరం సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతీ మాట్లాడుతూ ఒకవేళ తక్కువ వయసులో పెళ్లయిపోయిందని ఇప్పుడేం చేయాలని బాధపడకుండా 181 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఒక ఫోన్ చేస్తే చాలన్నారు. ఆ పెండ్లి చెల్లుబాటు కాదని, దానికోసం వివిధ రకాల చట్టాలు ఉన్నాయని తెలియజేశారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లలిత కుమారి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, షూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, చైల్డ్ సిబ్బంది ఉన్నారు.

పూలే దంపతుల సమగ్ర వాంగ్మాయాన్ని తెలుగులో ప్రచురించాలి



నవతెలంగాణ-తలమడుగు

మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు మరాఠీలో రాసిన సమగ్ర వాంగ్మయం పూలే దంపతుల జీవిత చరిత్రను తెలుగులోకి అనువదించాలని మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను ప్రముఖ సాహితీవేత్త హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు, అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే కలిసి విన్నవించారు. పూలె దంపతుల జీవిత చరిత్రను తెలుగులో అనువాదం చేయడం ప్రారంభించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల సమగ్ర వాంగ్మాయాన్ని తెలుగు పాఠకుల కోసం తెలుగు భాషలో ప్రచురించి, తెలుగు రాష్ట్రాల ప్రజలకి అందించేలా కృషి చేయాలని కోరారు. డిప్యూటీ సీఎంని కలిసిన వారిలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షులు విలాస్‌రావు పాటిల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాల మాలి మహా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే పాయల శంకర్ కృషి చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ అన్నారు. కంది కొనుగోళ్లలో పరిమితిని పెంచడంలో కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదలు తెలుపుతూ మంగళవారం మార్కెట్ యార్డులో రైతులతో కలిసి ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రైతు సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటలు చేశారని గుర్తు చేశారు. ఫసల్ భీమా సాధించడంలో కృషి చేశారని తెలిపారు. కంది రైతుల నుంచి ప్రభుత్వం 3 క్వింటాళ్ల 30 కిలోల వరకే కొనుగోళు చేస్తుందన్నారు. పరిమితి పెంచేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కలిసి రైతులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను తెలియజేశారు. మూడు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్లకు పరిమితి పెంచారని తెలిపారు. దీన్ని స్వాగతిస్తు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్‌చంద్ర, రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని అనంతపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొరెంగ హనుమంతు ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. కాగా స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించిన, పూర్తిగా మంటలు అంటుకుని ఇల్లు కాలిపోయినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ...

మండలంలోని అనంతపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కోరంగా హనుమంతు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. దీంతో విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ సోయం బాపూరావు, కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కె పాండు రంగ్, మాజీ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్యతో పాటు నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దీంతో మానవతా దృక్పదంతో మాజీ ఎంపీ సోయం బాపూరావు బాధితునికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈర్ల శివుడు, కళ్లెం విఠల్, అరె పాండు, కీర్తి రమణ, జడల శ్రీనివాస్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, విజయ్, మాణిక్ రావు, బొమ్మేత నర్సయ్య పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఉద్యోగోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ధన్నూర్(బి) గ్రామంలోని మంగళవారం పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోన్నతి పొందిన రావుల శంకర్‌ను మండల పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ పదోన్నతి పొందిన తర్వాత పాఠశాలలో చేస్తున్నటువంటి వినూత్న కార్యక్రమాలు పచ్చదనం, పరిశుభ్రత, అలంకరణ, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బిక్క గంగయ్య, మండలాధ్యక్షులు ఆర్టీవి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

ఘనంగా విజ్ఞాన మేళా



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ముందస్తుగా మంగళవారం విజ్ఞాన మేళను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు రకరకాల ప్రాజెక్టులు రూపొందించి, వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ సుభాష్‌చంద్ర, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ఎల్.ప్రవీణ్, విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి వారిని అభినందించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ సామాన్యశాస్త్రం ప్రాధాన్యతని వివరించారు. ముఖ్యంగా మిస్సైల్, రాకెట్స్, బ్లైండ్ స్టిక్, అగ్ని పర్వతం, వాయు నీరు, నేల కాలుష్యం, నీటి చక్రం, పోషకులు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని బాలిక జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సీనియర్ ఇంటర్ విద్యార్థుల విడ్కోలు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ పాల్గొని, సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, నృత్యాలు చేశారు. తోటి స్నేహితులు కేరింతలు కొడుతూ ఉత్సాహపరిచారు. కొందరు నృత్యాల దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణం పెరుగుతుందన్నారు. చదువుతో పాటు ఆట, పాటలు ఎంతో అవసరమన్నారు. మార్చి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు భగవాండ్లు, ధన్‌రాజ్, అధ్యాపకులు ప్రేమ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు వారి అనుభవాలను పంచుకుంటూ, అదే విధంగా కళాశాల సిబ్బంది కూడా విద్యార్థులు భవిష్యత్తులో ఏ విధంగా ఉండాలి, ఏ మార్గంలో చదివి ఉన్నత స్థాయి శిఖరాలను అధిరోహించాలనే అంశాల మీద విద్యార్థులకు తెలియజేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు అందరూ కలిసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే.సుదర్శన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.సంతోష్ ఇతర అధ్యాపక బృందం కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-దస్తురాబాద్

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మున్యాల గోండుగూడ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోండుగూడకు చెందిన పుర్క జగన్(45) మద్యానికి బానిసై మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి వద్ద గుర్తుతెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, ఖానాపూర్ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య రాధా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శంకర్ తెలిపారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ, వీడ్కోలు దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సమయం ఎంతో ప్రాధాన్యమైనదని దానిని వృధా చేయకూడదన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల పిన్సిపల్ రాందాస్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళు, లెక్చరర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని మర్రిపల్లి గ్రామంలో నాటుసార తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. నాటుసారా సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టగా, మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన జర్పుల అలు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్దున్న 10 లీటర్ల నాటుసారా, టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నాటుసారా అమ్మిన, తయారుచేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర స్థలాన్ని పరిశీలించిన సీఐ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో బుధవారం జాతర నిర్వహిస్తుండగా మంగళవారం సీఐ సత్యనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. జాతరకు వచ్చే వ్యాపారస్తులకు పూర్తిస్థాయిలో సహకరించి శాంతియుతంగా జాతర నిర్వహించాలని, జాతరలో ఎలాంటి ఇబ్బందులు వచ్చిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలోనే పార్కింగ్ చేయాలని, జాతరను విజయవంతం చేయడానికి అందరు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని నవేగుడ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన నీటికుంట పనులను మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ, ఏసీలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం రోజువారీగా పని చేస్తే గరిష్ఠ వేతనం రోజుకు రూ.300 వస్తాయని, వారానికి రూ.1800 పొందవచ్చని కూలీలకు అవగాహన కల్పించారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఉదయమే పనికి వచ్చి కొలత ప్రకారం పనిచేసి త్వరగా ఇంటికి చేరుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీని సందర్శించారు. నర్సరీలో పూర్తిస్థాయిలో జర్మినేషన్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జీపీ అవసరాలకు అనుగుణంగా మొక్కలను పెంచాలని కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 41 మంది హాజరై పరీక్షలు నిర్వహించుకోగా, ఇందులో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కంటి వ్యాధులు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తామలజిస్ట్ వెంకటేష్, వైద్య శిబిరం ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

ఆర్ఓ వాటర్ ప్యూరిఫైర్ అందజేత

మహారాష్ట్రలోని చెప్రాల శ్రీకార్తీక్ మహారాజ్ మందిరానికి డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు మంగళవారం ఆర్ఓ వాటర్ ప్యూరిఫైర్‌ను అందించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దీనిని అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్-అనిత దంపతులను సన్మానించారు.

రైలు కిందపడి వృద్ధుడు మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రైలు కింద పడి వికారాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ సిటిజన్ మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం వికారాబాద్ జిల్లా ఏళ్లకొండ గ్రామానికి చెందిన ముగ్గురు సీనియర్ సిటిజన్‌లు కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ నెల 23న వారణాసిలో విజయవాడకు వెళ్లే ప్రత్యేక రైలు ఎక్కారు. ఇందులో పులిగారి సుదర్శన్‌రెడ్డి (67) కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. మృతుని కుమారుడు రాంరెడ్డికి మృతదేహాన్ని అప్పగించినట్లు హెచ్‌సీ తెలిపారు.

పథకాలను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాయని వాటిని మహిళలు సద్వినియోగించుకోవాలని జిల్లా అదనపు గ్రామీణ అభివద్ధి అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా మహిళలు గర్భిణులుగా ఉన్నప్పుడు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఎస్‌బీఐ బ్యాంక్ మహిళలకు ప్రత్యేంకగా రుణాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్స్యూరెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నూతన్‌రెడ్డి, ఏపీఎం దుర్గయ్య, ప్రకాష్ సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి సింగరేణి స్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో పలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాల , విద్యార్థులు జీఎంని మర్యాద కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు భోదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకు ముందు రెబ్బెన సీఐ బుద్ద స్వామి, ఎస్సై చంద్రశేకర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పూల మొక్క అందజేశారు. ఇందులో కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు రవితేజ, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లాలో మొత్తం ఓటర్లు 6607 మంది
- మద్యం దుకాణాల మూసివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గురువారం జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో సిబ్బందిని సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ సామాగ్రి, పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు వంటివి పూర్తి చేశారు.

6607 మంది ఓటర్లు

ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజాంబాద్ ఉపాధ్యాయ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 6607 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2315 మంది పట్టభద్రులు ఉండగా వీరిలో పురుషులు 1689, స్త్రీలు 626 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 184 మంది ఉండగా వీరిలో పురుషులు 126, స్త్రీలు 58 ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 3822 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా వీరిలో 2608మంది పురుషులు, 1214 మంది స్త్రీలు ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 286 మంది ఉండగా 199 మంది పురుషులు, 87 మంది స్త్రీలు ఉన్నారు.



విధుల్లో 250 మంది సిబ్బంది

ఎన్నికలకు సంబంధించి ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 8 పోలింగ్ స్టేషన్లు, కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 9 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, కాగజ్‌నగర్‌లో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 17 పోలింగ్ కేంద్రాలకు 19 మంది పీఓలను, 87 మంది ఓపీఓలను, 17 మంది మైక్రో అబ్జర్వర్‌లను, మొత్తంగా 250 మందిని నియమించారు.

మద్యం దుకాణాల మూసివేత


ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో 48 గంటల ముందు నుంచి మద్యం దుకాణాలు మూసివేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం సాయంత్రం జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు మూసివేశారు. జిల్లా కేంద్రంలో 5 దుకాణాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 19 దుకాణాలు మూసివేశారు. దీంతో మద్యం ప్రియులు అగచాట్లు పడుతున్నారు.

సీసీఐ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరపాలి

- రాష్ట్ర నాయకులు ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా పరిణమించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాటన్ మిల్లు వద్ద పత్తి రైతులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలను కలిసి అక్కడి పరిస్థితులు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు ఆపడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాంకేతిక లోపం పేరుతో ప్రైవేట్ దళారులకు లాభం చేకూర్చేందుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దీనిపై అనేక అనుమానాలున్నాయని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తేమ, క్వాలిటీ వంటి నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ,15 రోజుల పాటు రోడ్లపై పడిగాపులు కాసేలా చేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. దీంతో క్వింటాల్‌కు రూ.7421 పొందాల్సిన రైతులు దళారులు రూ.6500కే పత్తిని విక్రయించుకుని నష్టపోయారన్నారు. ఈ నష్టపరిహారాన్ని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఇద్దరు బీజేపీ కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు, స్థానిక సిర్పూర్ ఎమ్మెల్యే కూడా ఎందుకు రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాలేదని గుర్తుచేశారు. రైతులు పులులు, అడవి పందులు, ఎరువులు, మందులు వంటి అనేక సమస్యలు అధిగమించి పంట పండిస్తే, ప్రైవేట్ వాళ్లకు అమ్ముకునే దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, యేడాదికి కౌలు రైతులకు రూ. 15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మార్చి 15 వరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యాంరావు, షేక్ చాంద్, కాశపాక రాజు, రాజేష్, అస్లాం, రైతులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పోలింగ్ సామాగ్రి



ఆసిఫాబాద్ :మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల పట్టబద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో పోలింగ్ నిర్వహణ కొరకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులకు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లతో పాటు అదనంగా బ్యాలెట్ బాక్స్‌లను కేటాయించడం జరిగిందని, కవర్లు, ఇంకు, గమ్, క్యాండిల్ ఫీల్ ఇతర సామాగ్రిని పరిశీలించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ బుధవారం నిర్ణీత సమయానికి అధికారులు పోలింగ్ సామాగ్రిని తీసుకోవాలని, భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీఓ లోకేశ్వరరావు, సంబంధితాధికారులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

నవతెలంగాణ-కెరమెరి

గెలుపోటములను సమానంగా స్వీకరించాలని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ అన్నారు. కరంజివాడ రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు మంగళవారం బహుమతులు అందజేశారు. గ్రామాల్లో క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫైనల్లో గెలుపొందిన సుల్తాన్ గూడ 11స్టార్ జట్టుకు మొదటి బహుమతి రూ. 21వేలు, రెండవ బహుమతి కెనరా బ్యాంకు మేనేజర్ జాదవ్ సందీప్ రూ.11 వేలు కరంజివాడ రాక్ స్టార్స్ జట్టుకు అందజేశారు. టోర్నీ నిర్వాహకులు బలవంత్, ఉదారం, ప్రకాష్, పరశురాం, నందులాల్, అర్జున్, సురేష్ పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్థిక అక్షరాస్యత పై మహిళలు అవగాహన పెంచుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ జోషి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గ్రామీణ అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు పొదుపు పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రూపాయి కూడా ఉపయోగపడే విధంగా ఖర్చు చేయాలన్నారు. అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటుందని వీటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. బ్యాంకు మేనేజర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు అనిచ్చితంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళా సంఘాల ప్రతినిధులకు ఎస్‌బీఐ అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం అన్నాజీ, ఏపీఎం సదానందం, బ్యాంకు సిబ్బంది సంతోష్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో రంజాన్ వేడుకలు జరుపుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ప్రతి మస్జిద్ దగ్గర పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు కాలువలలో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించాలని సూచించారు. ప్రార్థన సమయంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రార్థనల సమయాల్లో మస్జిద్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి దత్తారాం, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, తహసీల్దార్ రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ స్పెషల్ ఆఫీసర్లు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్‌తో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్క ప్రధానోపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం రూపొందించిన అంశాలను రోజువారీగా బోధిస్తూ, ముఖ్యమైన ప్రశ్నలను వెనుకబడిన విద్యార్థుల చేత చదివిపిస్తూ, ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణుడు అయ్యేలా కృషి చేయాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలలకు వచ్చినటువంటి నిధులను వెంటనే డ్రా చేయాలని, పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ అందరూ అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటేశ్వర స్వామి, ఎఫ్ఏఓ దేవాజి, కోఆర్డినేటర్‌లు ఉప్పులేటి శ్రీనివాస్, అబిద్‌అలి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గిరిజన వసతిగృహాల వర్కర్‌లకు పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు, డైలీ వేజ్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని గిరిజన బాలుర పాఠశాలలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు సంతోష్, సుల్తానా, కన్నుబాయి, అన్నుబాయి, తుకారాం, మహేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

మండలంలోని శంకరపల్లి గ్రామ రైతులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు తిరుపతి, శ్రీధర్ లతో కలిసి రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలు, మట్టి పరీక్షకు నమూనా సేకరించు విధానం, పరీక్ష అనంతరం రైతులకు అందించు సాయిల్ హెల్త్ కార్డుల, హెల్త్ కార్డుల ద్వారా అందించు సమాచారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, మాజీ సర్పంచ్ సల్లూరి సది, కారోబార్ హర్ష రైతులు అశోక్, శ్రీనివాస్, రాయలింగు, సాయి తదితరులు ఉన్నారు.

సెక్యూరిటీగార్డ్ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ అనారోగ్యం వల్ల, మరి ఏ ఇతర కారణాల వల్ల గాని ఉద్యోగం వదిలి వెళితే వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించాలని అన్నారు. ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్స్ ఇతర సమస్యల గురించి వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ కట్కూరి సతీష్, మిట్టపల్లి మొగిలి, కలవన స్వామి, నీరటి సురేష్, దేవ దామోదర్, ఇందూరి నరేష్, జి మహేందర్ పాల్గొన్నారు.

వేలాల జాతరకు వేళాయె..

- నేటి నుంచి ప్రారంభం
- గట్టుమల్లన్నను చేరుకుంటున్న భక్తులు

నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు సాగే వేలాల జాతరకు వేళైంది. గుట్ట దొనలో లింగాకారుడై భక్తులకు దర్శనమిస్తున్నాడు. బుధవారం నుంచి జాతర మొదలు కానుండగా మంగళవారం నుండే భక్తుల రాకపోక మొదలైంది. మహా శివరాత్రి రోజున గట్టుమల్లన్నను దర్శించుకుని అక్కడే జాగరణ చేయడం కోసం భక్తులు ఆనవాయితీగా పాటిస్తారు. రక్షిత అటవీ ప్రాంతంలో గుట్ట గుహలో పశ్చిమ ముఖ:ద్వారం ద్వార గట్టుమల్లన్న భక్తులకు దర్శనమిస్తున్నాడు. సుప్రసిద్ధిచెందిన శైవ క్షేత్రాల్లో ఒక్కటైన వేలాల మల్లిఖార్జున స్వామిని దర్శించుకునేందుకు జిల్లా వాసులతో పాటు ఇతర జిల్లాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా తరలివస్తారు. మల్లిఖార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తులు సమీపం గోదావరి నది స్నానం చేసి ఆలయ ప్రవేశం చేస్తారు. యాదవ కులదైవమైన మల్లిఖార్జున స్వామికి పట్నం వేసి నిండు బోనం (తీపి వంటకం)తో మొక్కులు చెల్లించుకోవడం శుభప్రదమని భక్తుల నమ్మకం.

రెండు రోజుల పాటు జాతర ఉత్సవాలు

వేలాల జాతరకు తరలివచ్చే భక్తులు మహా శివరాత్రి రోజున గట్టుమల్లన్న సన్నిధిలో గడిపి మరునాటి ఉదయం వేలాల గ్రామంలో వెలసిన మల్లిఖార్జున స్వామిని దర్శించుకోవడం ఆనవాయితి. యాదవుల కుల దైవమైన మల్లిఖార్జున స్వామికి శివరాత్రి మరుసటి రోజు గ్రామంలో గల ఆలయంలో పెద్దపట్నం వేసిన తదుపరి భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. కాగా దీనికి ఒక్క రోజుముందు దేవాలయ మండపంలో భ్రమరాంబ మల్లిఖార్జున స్వామికి కళ్యాణోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిపించడం ఆనవాయితిగా పాటిస్తారు. యాదవులు సాంప్రదాయ పద్దతుల్లో దేవతామూర్తులను గోదావరి నదికి తరలించి నదీ జలాలతో స్నానాలు చేపించిన పిదప మళ్లీ ఆలయ ప్రవేశం అనంతరం కళ్యాణోత్సవం జరిపిస్తారు. ఒగ్గు, డోలు వాయిద్యాల మధ్య కన్నుల పండువగా సాగే వివాహతంతులో భక్తులు ప్రత్యక్షంగా పాల్గొంటారు.



బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేలాలలో భారీ పోలీస్ బందోబస్తు

వేలాల జాతర సంధర్బంగా పోలీసుల బందోబస్తు భారీగా ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న జాతర సంధర్బంగా రామగుండం పోలీస్ కమీషనర్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచనల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సీసీఎస్ ఏసీపీ ప్రతాప్, ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులతో కలిసి జైపూర్ ఏసీపీ వెంటేశ్వర్లు సిబ్బందికి దిశానిర్దేషం చేశారు. జారత సంధర్బంగా సింగరేణి రెస్క్యూటీం సభ్యులతో కలిపి 402 మంది జాతర బందోబస్తులో పాల్గొంటున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో పాటు మరో ఐదుగురు సీఐల పర్యవేక్షణలో జైపూర్ ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి మరో 29 మంది ఎస్ఐలు జాతర బందోబస్తులో పాల్గొంటున్నారు. కిష్టాపూర్ సరిహద్దు నుండి పౌనూర్ సరిహద్దు వరకు ప్రధాన రహదారితో పాటు జాతర ఏరియా గట్టుమల్లన్న గుట్ట ఏరియాలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 32 మంది ఏఎస్ఐలు, 59 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 75మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 30 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు, 78 మంది హోంగార్డులు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, బెటాలియన్ పోలీసులు 24 మంది జాతర బందోబస్తులో పాల్గొంటున్నారు. అదేవిధంగా సింగరేణి రెస్క్యూ టీం సభ్యులు 16 మంది పాల్గొంటుండగా రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

నిరంతరం సీసీ కెమెరాల నిఘా

జాతరలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. రహదారులతో పాటు జాతర ఏరియాను ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వార పర్యవేక్షించనున్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. గట్టుమల్లన్న గుట్టతో పాటు వేలాల ఆలయ ప్రాంగణం ఏరియా ప్రధాన రహదారి, గోదావరి రోడ్డు మొత్తంగా 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాహణాల రాకపోకలు, ట్రాఫిక్ సమస్యలను సీసీ కెమెరాల ద్వార పర్యవేక్షిస్తూ అప్పటికప్పుడు తగు విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



గుట్ట దొన మార్గంలో ఏర్పాటు చేసిన క్యూలైను



వేలాల గుట్టపై ఏర్పాటు చేసిన టెంట్లు



బోనంతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

బైక్‌లు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి



నవతెలంగాణ-తాండూర్

కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైక్‌లు ఢీకోన్న ఘటనలో వీగాం గ్రామ పంచాయతీకి చెందిన యువకుడు దుర్గం రాజేష్(29) మతి చెందాడు. కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. వీగాం గ్రామానికి చెందిన దుర్గం రాజేష్, తన సోదరుడు అభిలాష్‌తో కలిసి బైక్ పై మల్లీడీకే వెళ్తుండగా బెల్లంపల్లి మండలం పెరకపల్లె గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ తన తండ్రి అంజయ్యతో కలిసి దహెగాం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలంపల్లి వద్ద శ్రవణ్ కుమార్ బైక్‌పై అతివేగంతో వచ్చి రాజేష్ బైక్‌ను ఢీకొడంతో రాజేష్ అక్కడికక్కడే మరణించాడు. అభిలాష్‌కు తీవ్రగాయాలయ్యాయి. శ్రవణ్ కుమార్, అంజయ్యాలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన. స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. గాయపడ్డ అభిలాష్‌ను ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. రాజేష్ మృతదేహాన్ని (పోస్టుమార్టం) పంచనామా నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు దుర్గం రాజేష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం



నవతెలంగాణ-లక్సెట్టిపేట

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని మండల విద్యాధికారి హెలెన్ డోరతి అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాయ్స్) ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నగునూరి సువర్ణ(స్కూల్ అసిస్టెంట్ సోషల్) పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి హెలెన్ డోరతి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమన్నారు. ఇంతకాలం ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు. పదవి విరమణ పొందుతున్న ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సునంద మాట్లాడుతూ వారితో గడిపిన కాలాన్ని, సేవలను మర్చిపోలేని, భవిష్యత్తులో తను ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని తెలిపారు. అనంతరం పదవి విరమణ పొందిన నగునూరి సువర్ణను పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దు

- జాతర ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

భక్తులకు సంబంధించిన వసతుల కల్పనలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం వేలాల గట్టుమల్లన్న గుట్టపై ఏర్పాట్లు పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. క్యూలైన్ల పొడవు టెంట్లు ఏర్పాటు చేయడమే కాకుండా నీటి సరఫరా తీరును పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీకి సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికలలో భాగంగా ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పోలింగ్‌కు బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి బ్యాలెట్ బాక్సులు, సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న జరుగనున్న శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని, 48 జంబో బ్యాలెట్ బాక్సులు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సులు 48 స్మాల్ బ్యాలెట్ బాక్సులు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సులు ఉపాధ్యాయుల ఎన్నికలకు 44 స్మాల్ బ్యాలెట్ బాక్సులు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సలను కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 40 పట్టభద్రులు, 18 ఉపాధ్యాయ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు ర్యాండమైజేషన్ ప్రక్రియలో కేటాయించిన ప్రకారంగా బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని, భద్రతా చర్యల మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్సులు, సామాగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఇబ్బందులు కలగకుండా చూస్తాం



నవతెలంగాణ-జన్నారం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం తెల్లవారుజామున గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బాదంపల్లి పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. గోదావరికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలైన కలమడుగు ధర్మారం బాదంపల్లి చింతాగూడ, రోటిగూడ, రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాలో ఏర్పాట్ల చేశామన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులతొ మాట్లాడి సమన్వయంతో పని చేస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చేస్తున్నామన్నారు. బాదంపల్లి స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ విజయ్ కుమార్, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణను గెలిపించాలి



నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం అన్నారు. మంగళవారం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసీ రవీందర్‌తో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో 10శాతం కూడా లేని అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నారని, 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు. 65 శాతం ఉన్న బీసీలకు ఉన్నత ఉద్యోగాల్లో నాలుగు శాతం కూడా రిజర్వేషన్ కల్పించడం లేదని, అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కూడా అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ వాదానికి, బహుజన వాదానికి కట్టుబడి ఉన్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఎస్పీ బలపరిచిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని కోరారు. ఓయూ విద్యార్థులు దాదాపు 5000 మంది క్షేత్రస్థాయిలో హరికృష్ణ గెలుపు కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను వ్యాపారంగా చేసుకుని, డబ్బుతో ఓట్లను కొంటూ గెలుస్తామని ధీమాతో అగ్ర వర్ణాల అభ్యర్థులు విర్రవీగుతున్నారని తెలిపారు. ఒక్క రూపాయికి వేలాదిమంది నిరుద్యోగులకు కోచింగ్ ఇస్తున్నారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల గురించి తెలిసిన వ్యక్తి హరికృష్ణ అని, అతని గెలిపించడం ద్వారా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వీరేందర్ పాల్గొన్నారు.

పట్టభద్రులకు అండగా కాంగ్రెస్

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-మంచిర్యాల

పట్ట భద్రులకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందని నిరుద్యోగుల సమస్యలు తీర్చడంలో వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం సభ విజయవంతానికి పాటు పడిన పట్ట భద్రులకు కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. విద్య, వైద్యం పరంగా నియోజక వర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు రానివ్వనని హామీ ఇచ్చారు. పదవితో నాకు పని లేదని నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానన్నారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల తరపున కొట్లడుతానన్నారు. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఐటి హబ్‌తో ఎంతో మందికి ఉపాది దొరుకుతుందన్నారు. జిల్లాలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క పట్ట భద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌లు సల్ల మహేష్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ స్కూల్ ఫేర్వెల్ డే వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మోడల్ స్కూల్‌లో ఫేర్వెల్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 9వ తరగతి, ఇంటర్మీడియట్ 1వ విద్యార్థులు పాఠశాల నుండి వెళ్లిపోతున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం విద్యార్థులకి వీడ్కోలు పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే పరీక్షలలో మండలం, జిల్లా స్థాయి కాకుండా రాష్ట్ర స్థాయిలో రాష్ట్రంలో ఉన్న 194 మోడల్ స్కూల్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, తమ పేరు పాఠశాల పేరు, తల్లితండ్రులకి మంచి పేరు గౌరవం తేవాలని ఆకాంక్షించారు. వచ్చే విద్యా సంవత్సరానికి 6వ తరగతి అడ్మిషన్స్ 100సీట్లు ఉన్నాయని మండలంలోని విద్యార్థుల తల్లితండ్రులు వినియోగించుకోవాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫేర్వెల్ డే వేడుకలకు హాజరైన విద్యార్థులు

గోదావరి వద్ద ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-లక్సెట్టిపేట

శివరాత్రి సందర్భంగా పట్టణంలోని గోదావరి నది వద్ద ఏర్పాట్లను లక్సెట్టిపేట సీఐ నరేందర్ మంగళవారం పరిశీలించారు. గోదావరిలో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాలకు భక్తులు స్నానాలకు వెళ్లకూడదని, గోదావరి వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.

ముల్కల్ల పుష్కరఘాట్ మూసివేత

నవతెలంగాణ-హాజీపూర్

శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ముల్కళ్ల పుష్కర ఘాట్‌కు రావద్దని పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు హెచ్చరికలు జారీచేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గోదావరి పుణ్య స్నానాలకు పెట్టింది పేరు. కానీ ఈ ఏడాది అక్కడ స్నానాలకు అధికారులు నిషేధం విధించారు. ఇక్కడికి జిల్లాలోని సుదూర ప్రాంతాల వారు బెల్లంపల్లి, తాండూరు, మందమర్రి, నస్పూర్, కృతనపల్లి మున్సిపాలిటీల నుంచి ప్రతి ఏడాది శివరాత్రికి లక్ష వరకు జనాలు పుణ్యస్నానాలకు వస్తుంటారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ మూసి వేస్తున్నట్లు తెలిపారు. పుణ్య స్నానాలకు వచ్చే వారు వేరే ప్రాంతాలకు వెళ్ళాలని అధికారులు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

యూ డైస్‌లో తప్పుల్లేకుండా నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యూ డైస్‌లో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని డీఈఓ ప్రణీత సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న యూడైస్ వర్క్ షాప్‌ను ఆమె సందర్శించారు. ఈ మేరకు అన్ని మండలాల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ



ఆపరేటర్లు సీఆర్పిలను ఉద్దేశించి మాట్లాడారు. యూడైస్‌కు సంబంధించి అన్ని అంశాలను తుది నిర్ధారణ చేయాలని సూచించారు. ఎలాంటి పెండింగ్స్ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు జె.నారాయణ, సుజాత్‌ఖాన్, ఉస్మానుద్దీన్, శ్రీకాంత్ గౌడ్, ఏపీఓ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కుభీర్ తహసీల్దార్‌గా రాంచందర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కుభీర్

కుభీర్ తహసీల్దార్‌గా రాంచందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేసిన అశోక్ బైంసా డిప్యూటీ తహసీల్దార్‌గా వెళ్లిడంతో ఆయన స్థానంలో ఖాళీ అయ్యింది. దీంతో హైదరాబాద్ కమిషనర్ సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్‌గా పని చేసిన రాంచందర్ కుభీర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం కార్యాలయంలో ఉన్న గదులను పరిశీలించి, ఇతర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



మొక్కలకు డిజిటల్ ట్రీ ఆధార్



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ముక్రా(కె) గ్రామంలో మొక్కలకు డిజిటల్ ట్రీ ఆధార్‌ను మంగళవారం మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి అమర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో పౌరులుగా గుర్తింపు కోసం, ప్రభుత్వ పథకాల లబ్ధిపొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి. అదే తరహాలో చెట్ల పరిస్థితిపై డేటాబేస్‌ను సమీకరించడానికి డిజిటల్ ట్రీ ఆధార్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గ్రామంలో ప్రతి చెట్టును జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్‌ను కేటాయించడం జరుగుతుందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ మొక్క ఆరోగ్యం, వయస్సు, పెరుగుదల క్రమం, ఆ మొక్క నుంచి ఎంత ఆక్సిజన్ వస్తుందో తెలుస్తుందన్నారు. ఆ వృక్షం ఉన్న నిర్దిష్ట ప్రాంతం పెరుగుదల క్రమం, ఆ మొక్క లొకేషన్ తెలుస్తోందని అన్నారు. ఇలా చేయడంతో ప్రతి మొక్క బ్రతుకుందని మనిషికి ఏ విధంగా ఐతే ఆధార్ కార్డు ఉంటుందో అలాగే మొక్కలకు కూడా డిజిటల్ ట్రీ ఆధార్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్‌ను కేటాయించడం తెలంగాణలోని తొలి గ్రామం ముక్రా (కె) అని అన్నారు. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్‌ను కేటాయిస్తే నాటిన ప్రతి మొక్క బ్రతుకుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే గుణపాఠం చెప్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొమురంభీంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా రూ.8వేల కోట్లకు పైగా ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం మీదనే ఆధారపడి పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీలు పూర్తయిన వారి సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని వాపోయారు. రియంబర్స్‌మెంట్ నిధులు చెల్లించకపోతే ప్రయివేట్ యాజమాన్యాలు, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదేవిధంగా వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపాలక్ష్మి జిల్లా నాయకులు మెస్రం వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ మండల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు జామ్ గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి అభ్యర్థించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కాల్వ నరేష్, చంద్రప్రకాష్‌గౌడ్, కరిపే విలాస్, చెన్న రాజేశ్వర్, వీరయ్య, తిరుమలచారి, ఆడెపు మహేందర్, లక్ష్మణ్, నర్సయ్య, తుల మహేందర్, రామ్ లింగారెడ్డి, దేవన్న, మహేష్, దయాకర్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

ముధోల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడే వ్యక్తిత్వం ఉన్న బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ ధర్మపురి సుదర్శన్, తాటేవార్ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రయివేటు పాఠశాలను సందర్శించి నిరుద్యోగులను, పట్టభద్రులను వారు కలిశారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఏమైందని, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నరేష్, శంకర్ పాల్గొన్నారు.

నేడు గుట్ట వీరన్న శివాలయంలో కళ్యాణోత్సవం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని నాయుడువాడలో స్వయంబుగా వెలిసినటువంటి గుట్ట వీరన్న శివాలయంలో శివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే రాత్రి విగ్రహాల ఊరేగింపు, కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. మరుసటి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఆరు గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ముగ్గురు అరెస్ట్, సెల్‌ఫోన్స్, చాకు, బైక్ స్వాధీనం
- తమ గ్రూపులో రావడం లేదనే కారణంతో హత్య
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో తెల్లవారుజామున ఓ యువకుడిని కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. మృతుడి భార్య ప్రవళిక ఉదయం 8 గంటలకు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేవలం ఆరు గంటల్లో కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను ఏ1 గోవింద్ కార్తిక్, ఏ2 ప్రణీత్, ఏ3 సాయికిరణ్‌ను అరెస్ట్ చేశారు. మూడు సెల్ ఫోన్‌లు, చాకు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి మంగళవారం రాత్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు జల్సాగా తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడుతున్నారు. ఓ గ్యాంగ్‌గా ఏర్పడి నేరాలు చేయాలనే దురుద్దేశంతో క్రాంతినగర్‌కు చెందిన మృతుడు కొమ్మవార్ రవితేజ(26)ను తమతో పాటు తిరుగుతూ నేరాలకు కలిసి పాల్పడుదామని ఆలోచనతో అతన్ని ప్రేరేపించారు. దీనికి రవితేజ నిరాకరించాడు. దీంతో ముగ్గురు నిందితులు సోమవారం రాత్రి మద్యం తాగి మత్తులో ఇంటికి వెళ్తున్నారు. రవితేజను మార్కెట్ యార్డ్ సమీపంలో అడ్డగించారు. తమతో గ్యాంగ్‌లో తిరగమని మరోసారి ప్రేరేపించగా అతను నిరాకరించడంతో



వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ముగ్గురు కలిసి కత్తితో మెడపై పొడిచి హత్య చేశారు. తీవ్ర రక్తస్రావం జరిగి రవితేజ అక్కడికక్కడే మరణించాడు. ఇదివరకే ముగ్గురు నిందితులపై పలు కేసులు ఉన్నాయి. మృతుడు రవితేజ సైతం పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. జల్సాలకు అలవాటు పడుతూ భవిష్యత్తులో మరిన్ని ఘోరమైన నేరాలు చేయాలని దురుద్దేశంతో గ్యాంగ్‌గా ఏర్పడి నేరాలకు పాల్పడే వారి ఉద్దేశం సరైంది కాదని, వారిపై క్రైమ్ నెంబర్ 72/2025తో సెక్షన్ 103(1)ఆర్/డబ్ల్యు3(5) బిఎన్ఎస్‌తో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ముగ్గురు నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. జిల్లాలో ఎవరైన కత్తులతో తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హత్య వెనుక ఈ ముగ్గురే కాకుండా వేరే వాళ్ల ఉన్నారని భార్య ఫిర్యాదు చేసింది. ఆ కోణంలో కూడా దర్యాప్తు చేపడతామని స్పష్టం చేశారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, సిసిఎస్ సీఐ చంద్రశేఖర్, జైనథ్ సీఐ సాయినాథ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

- 2కే రన్ ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆర్బీఐ ఆధ్వర్యంలో ఈనెల 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం టూ కే రన్‌ను నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కలెక్టర్ క్రీడ జ్యోతి వెలిగించి, జెండా ఊపి రన్ ప్రారంభించి వారితో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేలా ఆర్బీఐ ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ రంగంలో ఉన్న పొదుపుతో పాటు క్రెడిట్, రుణాలు తదితర వాటి గురించి తెలుసుకోవాలన్నారు. బ్యాంకర్లు కూడా మహిళలకు అత్యధికంగా రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు చేయాలన్నారు. అదే విధంగా బాలికల కళాశాలలు, పాఠశాలతో పాటు మహిళా సంఘాల వారికి దీనిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. మహిళ యువత బ్యాంక్‌ల ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కలిగి, పొదుపుతో పాటు బ్యాంక్‌ల ద్వారా అర్థిక స్వావలంభనాన్ని పొంది తమ తమ కుటుంబ అర్థిక స్థితిగతులను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కింద జిల్లాలో చేపట్టే కార్యక్రమాల గురించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పొదుపుపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, టీజీబీ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పథకాలను సమర్థవంతంగా అమలు చేద్దాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రభుత్వ పథకాలను జిల్లాలో గెజిటెడ్ అధికారుల సహకారంతో సమర్థవంతంగా అమలు చేద్దామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, ఆదిలాబాద్ జిల్లా శాఖ రూపొందించిన డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పథకాలతో పాటు సమాచారాన్ని పొందుపరచడం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన విస్తృత సమాచారాన్ని పొందుపరిచి డైరీని రూపొందించినందుకు గజిటెడ్ అధికారులు సంఘం నాయకులను కలెక్టర్ అభినందించారు. డైరీని రూపొందించేందుకు సహకారం అందించినందుకు సంఘం అధ్యక్షులు శివకుమార్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో



సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శివకుమార్, రామారావు, సలహాదారులు రాజేంద్ర దేశ్‌పాండే, అసోసియేట్ అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు రాజేషుడు, వామన్ రావు, ప్రదీప్ కుమార్, రజనీకాంత్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు అరుణ, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు అనిల్, నరేష్, వినూత్న, నిర్వహణ కార్యదర్శి మహేష్, ప్రచార కార్యదర్శి సంతోష్, కార్యాలయ కార్యదర్శి ధర్మేందర్, క్రీడల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భగత్ రమేష్, చంద్రశేఖర్, నరేష్, సరోజ, మోహన్, జైపాల్ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్ల జారీకి చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సదరం సర్టిఫికెట్లలో ప్రభుత్వం మరో 21 అంశాలను జోడించిందని, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లను జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం రిమ్స్‌లోని సదరం క్యాంప్ కార్యాలయంతో పాటు శిబిరం నిర్వహించడానికి స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణంలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించి మ్యాప్ చూశారు. ఈ స్థలం సదరం క్యాంప్ నిర్వహణకు అనువుగా ఉంటుందని భావించి ప్రభుత్వానికి నివేధికలను పంపించనున్నారు. అంతకు ముందు గతంలో సదరం సర్టిఫికెట్ల జారీ, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు సదరం ద్వారా సర్టిఫికెట్లను అందించడం జరగుతుందన్నారు. గతంలో కేవలం 6, 7 రకాల దివ్యాంగులకు మాత్రమే సర్టిఫికెట్లను అందించే వారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం 21 రకాల వ్యాధుల దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందించేలా ప్రణాళిక చేసిందన్నారు. త్వరలో ఆయా విభాగాల వైద్యులతో సదరం శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు శిబిర ఏర్పాటుకు రిమ్స్‌లో ఆయా విభాగాలను పరిశీలించడం జరిగిందని వివరించారు. వీటి గురించి ప్రభుత్వానికి నివేదికలు పంపి అనుమతి తీసుకొని శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏసీడీఓ మిల్కా, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, డీపీఆర్ఓ తిరుమల పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- పట్టుబడ్డ మహిళా ఎస్సై, కానిస్టేబుల్



నవతెలంగాణ-భైంసా

ఎక్సైజ్ సీఐ కార్యాలయంపై ఏసీబీ అధికారులు మంగళవారం రాత్రి దాడి చేశారు. వ్యాపారి సుభాష్‌గౌడ్ వద్ద లంచం తీసుకుంటుండగా ఎక్సైజ్ ఎస్సై నిర్మలతో పాటు కానిస్టేబుల్ సుజాతను రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. కల్లు వ్యాపార విషయమై వీరు లంచం డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. ఎస్సై నిర్మల లంచం డబ్బులను కానిస్టేబుల్ సుజాత ద్వారా తీసుకుంటోందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సుజాతకు డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సైతో పాటు కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీలు రమణమూర్తి, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్ దాడి చేసిన వారిలో ఉన్నారు.

ఢిల్లీ ఆలిండియా సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖానాపూర్

ఆర్ఎస్ఎస్-బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, కోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ పార్కులో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న ఢిల్లీలో ఆలిండియా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనికులు, పేద ప్రజల మధ్య అసమానతలు మరింత పెరిగిపోయాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించాయని, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని, సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని పేర్కొన్నారు. విద్యా, వైద్యానికి జీడీపీలో 6, 3 శాతం కేటాయించాలని డిమాండ్‌కు స్పందన లేదన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతోందని, కుల, మతాలను ప్రేరేపించే వైపుగా సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రములో పార్టీ నాయకులు. ఎల్లయ్య, ముస్కె శంకర్, గోరెబయ్, లక్ష్మణ్, లింగుపటేల్, జితేందర్ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 33 ఏండ్లుగా విద్యాసంస్థలు నడుపుతున్న మంచి విద్యావేత్త నరేందర్‌రెడ్డికి పీఆర్టీయూ మద్దతిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అవసరమని, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ రైల్వేలైన్ కోసం కేంద్ర రైల్వే మంత్రితో చర్చించడం జరిగిందని, ఇరు ప్రభుత్వాలు 50శాతం చొప్పున నిధులతో ఈ ప్రాజెక్ట్ ముందుకు కదలనుందని తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌కు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపారు. ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి పట్టభద్రులందరూ తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు జీవన్‌రావు, కౌన్సిలర్ ఇమ్రాన్, నాయకులు మోర ఆశన్న, షకీల్, డేరా కృష్ణరెడ్డి, అఖిల్ రెడ్డి, కొండూరి రవి, శ్రవణ్ నాయక్, పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మేజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంజేపీ, మైనార్టీ స్కూళ్లతో పాటు కోర్టులోని న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్టు పేర్కొన్నారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, న్యాయవాదులు, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, బొల్లారం బాబన్న పట్టభద్రులను కోరారు. మండలంలోని బరంపూర్, దేవాపూర్ గ్రామాల పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏడాది కాంగ్రెస్ పరిపాలనలో ఉద్యోగ నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులు బదిలీలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తిరుపతి, కే.ప్రతాప్, పోశెట్టి, పాట్నా నర్సయ్య, బాబురావు, వెంకన్న యాదవ్, నర్సింలు, విఠల్, పట్టభద్రులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ డా. వి.నరేందర్ రెడ్డిని గెలిపించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మావల గ్రామంలో 12వ వార్డు న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మావల మండలాధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, మావల యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, అడెల్లు, దినేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్ : కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని అన్ని వర్గాల మేధావులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొడ్డు గంగరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల రాజు, గడ్డల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతంగా పూర్తి చేసుకోవాలి

- డిపిఓ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-జైపూర్

మూడు రోజులపాటు వేలాల గ్రామంలో నిర్వహించుకోనున్నారు జాతర ను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని మంచిర్యాల డిపిఓ వెంకటేశ్వరరావు సూచించారు. వేలాల గ్రామపంచాయతీ కార్యాలయంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేలాల మల్లికార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధులు కేటాయిచిన పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు తమ విధులకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి డీఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

అర్హత గల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఫిబ్రవరి 27వ తేదీన జిల్లాలో నిర్వహించే పోలింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజున ప్రత్యేక ఆకస్మిక సెలవు వాడుకొనుటకు, ప్రయివేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

పెద్దపులి తిరుగుతోంది..
అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

కుందారం రక్షిత అటవీ ప్రాంతానికి వచ్చిన పెద్దపులి శివ్వారం, పౌనూర్ ప్రాంతాల్లో తిరుగుతున్నందున ఆయా ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఎస్ఐ శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం కుందారం అటవీ ప్రాంతంలో తిరిగిన పెద్దపులి మంగళవారం శివ్వారం, పౌనూర్ ప్రాంతంలో తిరుగుతున్నట్లు అటవీ అధికారుల నుండి సమాచారం అందిందని తెలిపారు. కుందారం-శివ్వారం మధ్యన పులి సంచారం కొనసాగుతున్నందున సరిహద్దు ప్రాంతాల వారు అటవీ ప్రాంతం వైపు వెల్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. పశువుల కాపర్లు రైతులు జాగ్రత్తగా ఉండాలని పశువుల కాపర్లు అటవీ ప్రాంతం వైపు వెల్లవద్దని, రైతులు పంట పొలాల వైపు వెల్లకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

గట్టుమల్లన్న జాతరలో పాల్గొనే భక్తులు జాగ్రత్తగా ఉండాలి

రక్షిత అటవీ ప్రాంతంలో వెలసిన గట్టుమల్లన్న దర్శనార్థం తరలి వచ్చే భక్తులు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. కుందారం-శివ్వారం మధ్యన గల అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కొనసాగుతున్నందున గుట్టపై భక్తులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జన సంచారం విడిచి గుట్టపై ఒంటరిగా తిరిగేందుకు ఎవ్వరు ప్రయత్నించరాదని సూచించారు. జాతరకు తరలివచ్చే భక్తులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మహిళలు బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

మహిళలు బడ్జెట్ ప్లాన్ చేసుకొని కొంత మొత్తాన్ని బ్యాంకులలో పొదుపు చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి శాఖ చీఫ్ మేనేజర్ జి నరసింహ స్వామి అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2025 సందర్భంగా ఆర్థిక పరమైన విషయాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటారని అందులో మొదటగా గృహిణులు, తర్వాత వ్యాపారస్తులు, ఉద్యోగస్తులని, ఈ మూడు రకాలైన మహిళలు తమ తమ సంపాదనను, మిగులను బ్యాంకులలో పొదుపు చేసుకుంటూ ఉంటే కుటుంబ అవసరాలకు పనికి వస్తుందని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచించినట్లుగా సాధారణ గృహిణులు తమ కుటుంబం కోసమై వెచ్చించే ఖర్చులలో మిగిలిన పైకంలో నుండి నెలసరి బడ్జెటును ప్లాన్ చేసుకొని పొదుపు చేసుకోవాలని, తెలివిగా నడుచుకొని ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, విలాసవంతమైన ఖర్చులను తగ్గించుకోవాలని తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మందమర్రి



ఊరు మందమర్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. మంగళవారం 24వ వార్డులో పర్యటించి రూ.50 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామస్తులతో చర్చిస్తూ స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నవ తెలంగాణ-తాండూర్

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బెల్లంపల్లి తహసిల్దార్ జోత్స్న తెలిపారు. పట్టభద్రులు ఉపాధ్యాయుల సౌకర్యార్థం బెల్లంపల్లి పట్టణంలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ పరిధిలో 2763 మంది పట్టభద్రులు 166 మంది ఉపాధ్యాయులు ఓటు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం బెల్లంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 49, 50, 51 నంబర్లు గల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల కోసం జిల్లా పరిషత్ సెకండరీ గర్ల్స్ స్కూల్‌లో 28వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో నీడ తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఎల్ఓల ద్వారా ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. ఉదయం 8 గంటల నుండి నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

సీనియర్ కార్యకర్తకు
మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-హాజీపూర్

నమ్నూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త చిలుకూరి ఆనందచారి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ట్రీట్మెంట్ తీసుకొని మూడు నెలల అనంతరం డిశ్చార్జ్ అయి గ్రామానికి వచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్‌రావు చారిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బేర పోచయ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ సజావుగా
నిర్వహించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ అల్లం నరేందర్ తెలిపారు. మంగళవారం గర్ల్స్ హైస్కూల్‌లోని పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా గట్టి నిఘా పెట్టామన్నారు. డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు, పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ వాటిని నిరోధిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని
గెలిపించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎమ్మెల్సీ ఎన్నికలలో మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ (ఎం) సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు బీజేపీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నా కేంద్రం నుండి నిధులు తీసుకురావడంతో విఫలమయ్యారని అన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా హరీశ్‌రాజ్



నవతెలంగాణ-నస్పూర్

మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా హరీష్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఆరోగ్యంకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సెలవు దినంగా ప్రకటించాలి



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 27న నిర్వహించే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో సంబంధిత ఓటర్లందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేందుకు ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మేకల అక్షయ్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదివరకే ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాల ప్రకారం ప్రభుత్వ సంస్థలు ఓటర్లకు ప్రత్యేక సెలవుదినం అమలు చేయబోతున్నప్పటికీ పలు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేట్ సంస్థలు ఓటర్లకు ప్రత్యేక సెలవు దినాన్ని అమలుపరచనున్నట్లు ప్రకటించలేదన్నారు. ఈ కారణంగా సుదూర ప్రాంతాలలోని పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటింగ్‌కి దూరమయ్యే పరిస్థితి నెలకొందని, పోలింగ్ శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఆయా సంస్థలు ఉద్యోగులకు పోలింగ్ కొరకు ఓటర్లకు కేవలం కొన్ని గంటలపాటు సమయం కేటాయించడం వంటి ఉత్తర్వులు కాకుండా పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా ఈ నెల 27న ప్రత్యేక సెలవు దినంగా అన్ని సంస్థలు పాటించేలా మరోసారి ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. దీనిపై ఎన్నికల అధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ నెల 27న సెలవు దినంగా ప్రకటించాలని కోరుతున్నామన్నారు.

అధిక ధరలకు జాతర స్థలాల కేటాయింపు

- నిలదీసిన బీజేపీ నాయకులు
- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శ్రీ శివమల్లన్న స్వామి జాతర స్థలాల కేటాయింపులో సదరు కాంట్రాక్టర్ అధిక ధరలకు స్థలాలను కేటాయిస్తుండడంతో మంగళవారం వివాదం నెలకొంది. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 25 నుండి 27 వరకు ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయం వద్ద జాతర జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ జాతరకు గాను ఆలయ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలను దుకాణ సముదాయాలకు కేటాయించేందుకు గాను ఆలయ కమిటీ టెండర్లు నిర్వహించింది. ఈ టెండర్‌ను రూ. 6.25 లక్షలకు తుషార్ అనే వ్యక్తి దక్కించుకోగా ఇతను ఆలయ కమిటీ నిబంధనల మేరకు దుకాణదారులకు గజానికి రూ. 600 తీసుకోవాల్సి ఉంది. కాని దీనికి విరుద్ధంగా దుకాణాదారుల నుండి గజానికి రూ. 1000కి పైగా తీసుకోవడంతో విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకొని దుకాణాదారుల నుండి విషయం తెలుసుకున్నారు. తమ వద్ద నుండి రూ. 1,000, రూ. 1,200 చొప్పున వసూలు చేశాడని వారు చెప్పడంతో వెంటనే బీజేపీ నాయకులు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆలయ ఈఓ వేణుగోపాల్‌గుప్తాను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఆ కాంట్రాక్టర్‌ను మందలించినట్లు తెలిపారు.

చీడపీడల నివారణ చర్యలు చేపట్టండి

- భీమారం వ్యవసాయ అధికారి సుధాకర్



నవతెలంగాణ-జైపూర్

యాసంగి పంటల సాగులో చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలని భీమారం వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సూచించారు. కాజిపల్లి, పోలంపల్లి శివారులో సాగు చేసిన వరి, పెసర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. పెసర పైరులో రసం పీల్చు పురుగు గుర్తించినట్లు తెలిపారు. నివారణ చర్యగా ఇమిడ క్లోప్రిడ్ 1 ఎంఎల్ 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా అసిపేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినా రసం పీల్చు పురుగు నివారించవచ్చని అన్నారు. వరి పైరులో గుర్తించిన జింక్ లోపాన్ని నివారించుటకు 100 గ్రాముల చెలామిన్ జింక్ 12 శాతం ఒక ఎకరానికి 15 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు. సాగులోని పంటలకు సంబంధించిన చీడపీడల నివారణ కోసం ముందస్తు జాగ్రత్తల ద్వారా పంటలను ఆశించే చీడపీడలను నివారించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్లాంటేషన్ డ్రైవ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలం ఐసీడీఎస్, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో లక్ష్మీపూర్ గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల, ప్రైమరి స్కూల్‌లో భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజార్ మమత, ప్రమరీ స్కూల్ హెడ్మాస్టర్ చంద్రయ్య, స్కూల్ సిబ్బంది, జెండర్ స్పెసిలిస్ట్ విజయ, ఆర్థిక, అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, అంగన్‌వాడీ టీచర్స్ అలివేణి, ప్రేమలత పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.శేషరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్ సర్కిల్ సిర్పూర్ కాగజ్‌నగర్ డివిజన్‌లో 132/33 కేవీ కౌటాల సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తైందని, వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. టీజీట్రాన్స్కో రూ.31.19 కోట్లతో సబ్ స్టేషన్ ను నెలకొల్పడం జరిగిందని, 165 టవర్లు, 43.2 కిలోమీటర్ల మేర లైన్లు, 10/16 అనేది ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ ద్వారా చింతల మానేపల్లి, బెజ్జూరు, కౌటాల, సిర్పూర్ మండలాల ప్రజలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని, లో ఓల్టేజీ సమస్యలు ఉండవని తెలిపారు. కౌటాల సబ్ స్టేషన్ నుండి 33/11 కేవీ 8 సబ్ స్టేషన్ ద్వారా 104 గ్రామాల ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు. గతంలో ఈజ్ గాం 132 సబ్‌స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా అటవీ ప్రాంతం నుండి ఉండడంతో అంతరాయాలు ఉండేవని, కౌటాల సబ్‌స్టేషన్‌తో ఈ సమస్య తీరనుందని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి సారె అందించారు. ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు రాచకొండ నాగేశ్వరరావు, పులికాక పూజా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, కృష్ణ, ఉపాధ్యక్షుడు భాస్కర్, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు శారద, సుకన్య, ప్రధాన కార్యదర్శి వనిత, మండల మాజీ అధ్యక్షుడు బాపూజీ, సత్యనారాయణ, రాజన్న, వైకుంఠం, మాజీ జెడ్పీటీసీ సరిత, మాజీ సర్పంచ్ కావ్య ఆర్యవైశ్య యువజన మహిళ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జైనథ్

కందుల కొనుగోలు పరిమితి పెంచడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పాయల శంకర్ చిత్ర పటానికి మంగళవారం వ్యవసాయ మార్కెట్‌లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరానికి మూడు క్వింటాళ్ల 30 కిలోలు మాత్రమే కందులు కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రైతుకు ఎకరానికి నాలుగు క్వింటాళ్ల పైనే దిగుబడి రావడంతో అమ్మడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మంత్రితో మాట్లాడి సమస్యను విన్నవించారు. సమస్యపై స్పందించిన ప్రభుత్వం కొనుగోళ్ల పరిమితిని 6క్వింటాళ్లకు పెంచిందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రాకేష్‌రెడ్డి, నాయకులు నారకట్ల ప్రతాప్, బింగి వెంకన్న పాల్గొన్నారు.

బాధి నందేశ్వర జాతర ప్రారంభం

నవతెలంగాణ-బేల

మండలంలోని బాధి గ్రామంలోని వీరబాధి నందిశ్వరుని జాతర మంగళవారం జుగ్నక్ వంశస్థులు ప్రారంభించారు. ముందుగా జుగ్నక్ వంశస్థులు వీరబాధి నందిశ్వరునికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పై దివ్యభారతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల పార్కింగ్ స్థలాలను ఏర్పాట్లు చేయాలనీ, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాని ఆలయ చైర్మెన్‌ని కోరారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ జుగ్నక్ గాంధీ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జుగ్నక్ వంశస్థులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఓ కాలనీలోని ఇంట్లో చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న తుమ్మల విజయ ఇంట్లో ఈనెల 8న రాత్రి చోరీకి పాల్పడ్డాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నేతాజీ చౌక్‌లో దొంగ షేక్ తబ్రీజ్ (19)ను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే కాలనీలో నివాసం ఉంటున్న దొంగ అదే కాలనీలో దొంగతనం చేసి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆ నగదును జల్సాలకు ఖర్చు పెట్టినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-తిర్యాణీ

పట్టభద్రులంతా ఏకమై కాంగ్రెస్ బలపరిచిన నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిత్తారి సాగర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు తీరాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ఇందులో యూత్ మండలాధ్యక్షుడు పున్నం హరీష్‌కుమార్, ఎస్సీసెల్ పడగల అమర్, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్స బొక్కనపల్లి సాయికిరణ్, పెరుమళ్ల వెంకటేశం గౌడ్, మాజీ సర్పంచ్ కొట్నాక గణపతి, కొరివి రాహుల్, చిలుక వినోద్ పాల్గొన్నారు.

అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-కెరమెరి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును సమస్యలు పరిష్కరించే నాయకుడు అంజిరెడ్డికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే నాయకుడు కొమురయ్య గెలుపుకోసం పని చేయాలని కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. అంతకు ముందు పార్టీ జిల్లా నాయకుడు కొట్నాక విజయ్ ఎంపీని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ వెంకటి నాయక్, రాథోడ్ లాల్‌సింగ్ నాయక్, బాలాజీ పాల్గొన్నారు.

పట్టభద్రుల పక్షాన పోరాడుతాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టభద్రుల పక్షాన పోరాడతాం, వారి సమస్యల పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తామని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ గాదాసు రవీందర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుక్యరాజు అధ్యక్షతన ప్రసన్న హరికృష్ణ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీలు పట్టభద్రును మోసం చేశారన్నారు. సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే చట్టసభల్లో పోరాటం చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రసన్న హరికృష్ణ నిరుద్యోగుల కోసం ఇప్పటికే ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఉమ్మడి జిల్లా నాయకులు రంగు వేణు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పాత మార్కెట్‌లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో గల పాత కూరగాయల మార్కెట్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చుట్టూ ఉన్న దుకాణాదారులు, ప్రజలు చెత్త చెదారన్ని, కవర్లను పాత మార్కెట్ ప్రాంతంలో వేస్తున్నారు. చెత్తకు అగ్గి అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కన ఉన్న ఇంటి యజమానులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాత మార్కెట్‌లో చెత్తను తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోయి అగ్ని ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా నిరసన చేపడతామని హెచ్చరించారు.

